



"సార్! మీకోసం ఎవరో వచ్చారు."

దీక్షగా ఫైల్ చూస్తున్న విజయ్ ఆ మాటలకు తలెత్తి చూశాడు.

ఎదురుగా సెక్షన్ ప్యూన్ సాంబయ్య.

"తమరికోసం ఎవరో వచ్చారండి." చేతులు కట్టుకుని పళ్ళికిలిస్తూ అన్నాడు.

"ఎవరు?" అడిగాడు.

"ఎవరో ఆడోళ్ళండి. బయట కాంటీన్ దగ్గర పెట్టెకాడ నిలబడున్నారండి" అన్నాడు.

కుర్చీలోంచి లేచి గబగబ అడుగు లేసుకుంటూ బయటకెళ్ళిపోయాడు విజయ్.

"హలో... ఏమిటిలా వచ్చారు?" నవ్వుతూ అడిగాడు.

"మీతో కొంచెం అర్జంటుగా మాట్లాడే పనుంది. మీరు ఆఫ్ డే లీవుపెట్టి నాతో రాగలరా?" అడిగింది ఇందిర.

"కొంపదీసి రూమ్‌కి తీసుకెళ్ళి ఏ ప్రోటో కాపీల మీదనో సంతకాలు పెట్టమనరుగదా?" నవ్వుతూ అన్నాడు.

ఆ మాటలకు ఆమె నవ్వలేదు.

ఆమె మొహంలోని సీరియస్‌నెస్‌ని గమనించిన విజయ్—"ఇప్పుడే వస్తాను. ఒక్క నిమిషం ఆగండి" అంటూ వెళ్ళినతను అన్నట్టుగానే నిమిషంలో బయటకొచ్చి "పదండి" అన్నాడు.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

"ఏమిటి చాల సీరియస్‌గా ఉన్నారు? ఏం జరిగింది?" ఆమె మొహంలోకి చూస్తూ అడిగాడు.

ఒక క్షణం మౌనం తర్వాత—"అబ్బే ఏంలేదు" అంది.

"ఒంట్లో బాగుండలేదా?" మళ్ళీ అడిగాడు.

'బాగానే ఉంది' అన్నట్టు తలాడించింది.

సరే, ఆమెను ఏమడిగినా చెప్పేట్టులేదని—"చెప్పండి ఎక్కడికి వెళదాం!" అన్నాడు.

"మీ ఇష్టం" అంది.

దూరంగా వస్తున్న ఆటోని ఆపి, "పదండి" అన్నాడు.

ఆమె మౌనంగా ఆటో ఎక్కి కూర్చుంది.

పది నిమిషాల అనంతరం ఇద్దరు హోటల్ అన్నపూర్ణలో కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి? ఎందుకలా ఉన్నారు?" విజయ్ అడిగాడు.

ఆమె నోరు విప్పేలోపున సర్వర్ ప్రత్యక్షమయ్యాడు.

అతనివైపు చిరాగ్గా ఒకసారి చూసి, "రెండు కాఫీ" అన్నాడు.

సర్వరు క్షణంలో మరుగవగానే మళ్ళీ ఆమె ముఖంలోకి చూశాడు.

"విజయ్... నేనంటే మీ కిష్టమేకదూ!" తలొంచుకుని చూపుడు వ్రేలుతో టేబిల్ మీద ఒలికిన నీళ్ళతో సున్నాలు చుడుతూ అంది మెల్లిదిగా.

ఆమె మాటలకి విజయ్ నవ్వాడు. "భలేవారే! ఈ మాట అడగటానికే ఇంత దూరం తీసుకొచ్చేరు? ఆఫీసు దగ్గర అడిగితే, అక్కడే చెప్పి ఉండేవాడినికదా!" ఈజీగా తీసుకుంటూ అన్నాడు.

"పోనీ. ఇప్పుడు చెప్పండి...నా మీద మీ అభిప్రాయం?"

"అభిప్రాయాని కేముంది? మిమ్మల్ని సంవత్సరం నుంచీ నే నెరుగుదును. మీరు చాల మంచివారు. ముఖ్యంగా ఈ రోజుల్లో అమ్మాయిల్లా సినిమా లకీ, షికార్లకీ తిరగరు. ఆఫీసు, రూమ్ తప్పించి ఇంకే విషయాలు పట్టించుకోరు. నాతో తప్పించి ఇంకెవ్వరితోనూ స్నేహం లేదు. అది నాకే కాదు. మీ ఆఫీసులో కూడ అందరికీ తెలుసు. అందుకే మీ ఇష్టప్రకారమే మిమ్మల్ని నా స్నేహితుల కెవ్వరికీ పరిచయం చేయలేదు. నిజంగా మీలాంటి మంచి స్నేహితురాలు లభించడం నాకెంతో సంతోషంగానూ, గర్వంగానూ ఉంది" అన్నాడు విజయ్.

అతని మాటలకు అప్పటివరకూ విషాదాన్ని పులుముకున్న ఆమె కళ్ళు ఉత్సాహంతో మెరిశాయి. అంత చీకట్లో కూడ ఆ మెరుపు స్పష్టంగా కనిపించింది.

"అయితే...అయితే.. మీరు నన్ను పెళ్ళి చేసుకుంటారా?" సడన్‌గా అడిగింది ఇందిర.

ఆ మాటలకు విజయ్ ఆశ్చర్యపోయాడు.

సర్వర్ రెండు కప్పుల కాఫీ, ప్లేట్‌లో బిల్లు సవినయంగా టేబిల్‌మీద పెట్టి వెళ్ళిపోయాడు.

"ఇందిరగారూ! కాఫీ తీసుకోండి." కప్పు ఆమె ముందుకు జరుపుతూ అన్నాడు మొహంలో ఏ భావం కనబడనీయకుండా విజయ్ కాఫీ సిప్ చేస్తూ మవునంగా అతని కళ్ళల్లోకి చూసింది.

"మిస్ ఇందూ! నే నొకటి అడుగుతాను— నిజం చెప్పండి. మీకు నామీద ఎందు కటువంటి అభిప్రాయం కలిగింది? నే నెప్పుడైనా మీతో చనువుగా ప్రవర్తించానా?" నవ్వుతూ అడిగాడు విజయ్.

'లేదు' అన్నట్టు తలాడించింది.

"అయితే ఎందుకో చెప్పండి మరి?" అన్నాడు.

"మీరంటే నాకు చాల ఇష్టం. నేను ఆడపిల్లని ఇలా మాట్లాడుతున్నందుకు నన్ను నీచంగా భావించకండి. మిమ్మల్ని మొదట చూసినప్పట్నుంచీ నాకు మీమీద తెలీని ఏదో అభిప్రాయం ఏర్పడి పోయింది. మీరు నమ్మరు గానీ, మీరు పరిచయం కాకముందు నా కే మగపిల్లలతోనూ స్నేహంలేదు. ఎందుకో ఆ రోజు ట్రూకాపీకి మీ దగ్గర సంతకాని కొచ్చిన రోజు మిమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాను. ఇంత చిన్న వయసులో ఆఫీసరుగా పనిచేస్తున్న మిమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాను. అభినందించకుండా వెళ్ళాలేకపోయాను. పైగా మీరు అపరిచితమైన నన్ను ఎంతో మర్యాదతో పలకరించారు. అప్పట్నుంచీ ఏదో వంకతో మిమ్మల్ని చూడ్డానికి మీ ఆఫీసు కొస్తూండేదాన్ని. అప్పటికే నన్ను నేను కంట్రోలు చేసుకోడానికి చాలా ప్రయత్నాలు చేశాను కానీ మిమ్మల్ని చూడకుండ ఉండలేకపోయేదాన్ని.

అప్పటికీ ఒకటి రెండుసార్లు మీరు ఎంతో మర్యాదతో నన్ను మందలించారు— అస్తమానం ఆఫీసు కొస్తే ఏవరైనా ఏమైనా అనుకుంటారని! అప్పట్నుంచీ ఆఫీసు అయిపోయిన వెంటనే మీ ఆఫీసు బస్‌స్టాప్ దగ్గర నిలబడి మీ కోసం ఎదురు చూసేదాన్ని. ఎప్పుడూ మీ వెంబడి ఎవరో ఒకరు ఉంటూండేవారు. అలాంటప్పుడు ధైర్యంచేసి మిమ్మల్ని పలకరించలేకపోయేదాన్ని... నిజం చెప్పాలంటే నేను గుడ్డిగా మిమ్మల్ని ఆరాధిస్తున్నాను... ప్రేమిస్తున్నాను. మీ కిష్టమైతే నన్ను... నన్ను పెళ్ళి చేసుకోండి." ఎటో చూస్తూ అంది ఇందిర.

అప్పటివరకు ఆమె చెప్పిన దంతా మవునంగా విన్న విజయ్, చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు: "చూడండి, ఇందిరగారూ! మీ అభిప్రాయం మీరు తెలియజేశారు. తప్పులేదు. కానీ, నా ఉద్దేశం కూడా మీకు తెలియజేయాలిగా" అన్నాడు.


"అందుకేగా మిమ్మల్ని ఇంతదూరం తీసుకొచ్చింది చెప్పండి." అతని మొహంలోకి చూస్తూ సూటిగా అడిగింది.

ఆమె మాటలకు అతనేం మాట్లాడలేదు.

అతని మవునాన్ని చూసిన ఆమె, "ఫర్వాలేదు. చెప్పండి. 'ఎస్' ఆర్ 'నో' ఏదో ఒకటి!" నవ్వుతూ అంది.

"పెళ్ళి అనేది కేవలం ఇద్దరు వ్యక్తులకు సంబంధించినదే కాదు. రెండు కుటుంబాలను కలిపేది కూడా అని నా అభిప్రాయం.

మీరు నన్ను విపరీతంగా ప్రేమిస్తున్నానన్నారు— కావచ్చు. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారు — అదీ నిజమే కావచ్చు. కానీ, నా వ్యక్తిగత విషయాలు, కుటుంబ పరిస్థితులు మీకు తెలీవు. అలాగే మీ కుటుంబ విషయాలు నాకు తెలీవు. మీరు మద్రాసు నుంచి వచ్చి ఈ హైదరాబాద్‌లో



ఉద్యోగం చేసుకుంటూ, నాలాగే ఒంటరి జీవితం గడుపుతున్నారని మాత్రమే తెలుసు. అంతకుమించి నాకేం తెలీదు" అన్నాడు విజయ్.

"పోనీ అడగండి చెబుతాను. మీకు కావలసింది మా ఫామిలీ బాక్‌గ్రౌండ్...అంతేకదూ!" తేలిగ్గా నవ్వేస్తూ అంది.

"తొందర పడకండి. ఏ విషయాన్నీ అంత తేలిగ్గా తీసుకోకూడదు. అలా తీసుకుంటే తరవాత పశ్చాత్తాపపడవలసి వస్తుంది. 'ధీరంగా' గంభన్నాడు.

"అయితే ఏమంటారు?" నీరసంగా అంది.

"ఇందిర గారూ! అర్థం చేసుకోండి. నేను చెప్పాలంటే ఏదో ఒహటి అవుననో, కాదనో చెప్పగలను. అయితే నన్ను కూడా ఆలోచించుకోనీయండి. ఇప్పటివరకు నాకు మీ మీద అటువంటి అభిప్రాయం లేదు. అయితే నన్ను నేను స్టడీ చేసుకోనివ్వండి. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. పదండి వెళదాం..." చీకటిలో అడ్డొచ్చిన కుర్చీలు, టేబిళ్ళు, ఫాను తప్పుకుంటూ తప్పించుకుంటూ బయటకొచ్చారు.

"మళ్ళీ ఎప్పుడు కలుస్తారు?" మెల్లిదిగా అంది ఇందిర.

"వచ్చేవారం. ఈలోగా మీరు మళ్ళీ ఆలోచించుకోండి—మీ అభిప్రాయంలో ఏదైనా లోప ముందేమో!" నవ్వుతూ అన్నాడు విజయ్.

"వూహూఁ. అదేం ఉండదు. నేను బాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చేను." దృఢ నిశ్చయంతో అంది.

ఒక నిమిషం తరవాత ఆటోలో కూర్చుంటూ అంది—"అయితే నేను హోప్స్ పెట్టుకోవచ్చా?"

"అప్పుడే ఎలా చెప్పగలను?" అన్నాడు.

"అయితే ఈ వారం రోజులు నాకు నరకమున్న మాట." అదోలా నవ్వుతూ అంది. అతను నవ్వి వూరుకున్నాడు.

ఆటో స్పీడున ముందుకు దూసుకు పోయింది.

• • •

గదినిండా సిగరెట్ పీకలు పడి ఉన్నాయ్.

మంచం మీద అడ్డంగా పడుకున్న విజయ్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతను ఆఫీసుకెళ్ళి రెండురోజులైంది. అతని మనసంతా చాలా గజిబిజిగా ఉంది. వెంటనే అతనికి ఇందిర గుర్తుకొచ్చింది.

"ఇందిర..."

చక్కటిపేరు—మనసులో అనుకున్నాడు.

పాపం పిచ్చిపిల్ల తనను విపరీతంగా ప్రేమిస్తోంది. కానీ, తన గురించి నిజం తెలిస్తే, తనను అసహ్యించుకోవచ్చు. తన గురించి తెలిసిన చేదును తట్టుకోలేక తన నుంచి దూరంగా పారిపోవచ్చు. తనపై పెంచుకున్న ఆశలకు సిగ్గు పడవచ్చు. ఏమిటో ఈ ఆడపిల్లలు. విచిత్రమైన మనస్తత్వాలు... ఏదొచ్చినా పట్టుకోలేం... జ్యోతి మాత్రం?

జ్యోతి గుర్తుకు రాగానే అతని కళ్ళ వెంబడి రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి. జ్యోతి తనను విపరీతంగా ప్రేమించింది. తను కూడా

అంతే! ఒకటా? రెండా? నాలుగు సంవత్సరాల ప్రణయం. ఒకరినొకరు ఒక్కరోజు చూసుకోపోతే ఉండలేని రోజులు అవి. జీవితమంతా కలిసిమెలిసి ఉంటామన్న ఆత్యాశతో పెట్టుకున్న దారుణమైన ఒప్పందాలు.

ఏమయ్యాయి చివరికి?

తమిద్దర్నీ విడదీశాయి.

తను పిరికివాడు. చాతకానివాడు. ఎందుకూ పనికి రాని వాడు. జ్యోతి కన్నీళ్ళు తనను ఎంత శపించిందనీ!

ఆమె మాటలకే మంటలొచ్చుంటే తను పూర్తిగా కాలి మసై పోయేవాడు. ఆమె కళ్ళకే వరదొచ్చుంటే — ఆ ప్రవాహంలో తను కొట్టుకుని పోయేవాడు.

ఇప్పుడు జ్యోతికి తనంటే అసహ్యం, కోపం, జుగుప్స. కానీ, తనకి జ్యోతంటే ఇప్పటికీ ఇష్టం మరెప్పటికీ ఇష్టం.

తను ఎక్కడున్నా అందంగా, ఆరోగ్యంగా ఉండాలి. ఆనందంగా జీవితాన్ని గడపాలి.

విజయ్ ఆలోచనలు మళ్ళీ ఇందిర మీదకు మళ్ళాయి.

తను ప్రేమించిన అమ్మాయి కంటే తనను కోరుకున్న అమ్మాయి బాగా సుఖ పెడుతుందని ప్రతి మగాడికీ తెలుసు. ఇందిరను చూసుకుంటే తనను పువ్వుల్లో పెట్టుకుని పూజిస్తుంది. కానీ, తన కుటుంబ పరిస్థితి దృష్ట్యా తనలా చేయలేడు. ఇందిరకు అంతా చెప్పేస్తాను. మనసులో అనుకుని కృత నిశ్చయంతో లేచి ఆరిపోయిన సిగరెట్ పీసు దూరంగా గిరాటేసి రూమ్‌కి తాళం పెట్టి బయట కెళ్ళిపోయాడు.

• • • •

ఎదురుగా కూర్చున్న ఇందిర మౌనంగా, తదేకంగా విజయ్ కళ్ళల్లోకి చూస్తోంది.

అత నేం చెబుతాడా అని ఒళ్ళంతా చెవులు చేసుకుని కూర్చుంది. ఆ స్థితిలో ఇందిరను చూసిన విజయ్‌కు చాల జాలి అనిపించింది.

అతని మౌనాన్ని చూసిన ఇందిర అంది: "మీరేం చెబుతారో నేను ఇప్పటికీ వూహించుకోలేకపోతున్నాను. అబ్బ ఈ వారం రోజులు ఎంత నరకం అనుభవించా ననుకున్నారు?" నవ్వుతూ అంది.

"మిస్ ఇందిరా! నేను నా అభిప్రాయం చెప్పేముందుగా నా కుటుంబం కొంచెం చెప్పాలి. మీరు దయచేసి సావధానంగా వినండి. నా విషయాలు అర్థం చేసుకోడానికి ప్రయత్నించండి.

నాకు అమ్మ, నాన్న లేరు. వాళ్ళిద్దరూ మూడు సంవత్సరాల తేడాతో కాలధర్మం చెందారు. మేం అయిదుగురం అన్నదమ్ములం. నలుగురు అక్కచెల్లెళ్ళు. అమ్మ, నాన్న పోయిన తర్వాత కుటుంబాన్ని ఎంతో కష్టపడి పైకి తీసుకొచ్చారు అన్నయ్యలు. వాళ్ళకంటే చిన్నవాళ్ళమైన మా సుఖంకోసం వాళ్ళు ఎన్నో త్యాగాలు చేశారు. మా చదువులకి ఎంతో డబ్బు ఖర్చు పెట్టారు.

ఇప్పుడు నా కంటే పెద్ద వాళ్ళయిన ఒక అన్నయ్య, ఒక అక్కయ్య పెళ్ళి కావలసిన స్థితిలో ఉన్నారు. వాళ్ళ పెళ్ళి కాకుండా నేను పెళ్ళి చేసుకోడం బావుంటుందంటారా? అలా చేస్తే లోకం హర్షిస్తుందా?

ఇంట్లోవాళ్ళు నా మొహంమీద ఉమ్మి వేయరూ? నేను నా స్వార్థం చూసుకున్నాననుకోరూ?" అన్నాడు విజయ్.

"ఇంతకూ మీ రనేదేమిటి? పెళ్ళి చేసుకోడం కుదరదంటారా. అంతేగా దాని కింత డొంక తిరుగుడెందుకు. సూటిగా చెప్పొచ్చుగా!" కోపంగా అంది.

"ఇందిరా! నా కథంతా మీ కెందుకు చెప్పాననుకుంటున్నారు? నేను చెప్పాలంటే బ్లంట్‌గా చెప్పగల్ను. కాని, సున్నితమైన మీ మనసు నొప్పించడం ఇష్టంలేక నా పరిస్థితి అంతా వివరించాను" అన్నాడు విజయ్.

అతని మాటలకు ఆమె ఏమీ మాట్లాడలేదు. ఒక్క నిమిషం తర్వాత అంది: "విజయ్‌గారూ! నేను అందంగా లేనా?" అని.

ఆమె మాటలకు విజయ్ విరగబడి నవ్వాడు.

"ఎంత అమాయకులండి మీరు? లేకపోతే


## చిత్రకళ

## శంతను చిత్ర విద్యాలయం రజతోత్సవము కొనియాడుచున్నది



మీరు మీ ఇంటి యందుండే తపాలా పాఠములద్వారా చిత్రకళ నేర్చుకొని రెండు సంవత్సరములలో ఉత్తమ చిత్రకారులు కావచ్చును. యావద్భారత దేశము నుండియు విదేశముల నుండియు అనేక మంది మన విద్యాలయములో విద్యార్థులుగా చేరి ఉత్సాహంతో శిక్షణ పొందుచున్నారు.

మీరు కూడా ఈ సులభ పద్ధతులతో చిత్రకళ నభ్యసించుటకు నమ్మతించుచున్నారా? వివరముల కొరకు తొమ్మిది నయి పైసల స్టాంపులు పంపండి.

స్థాపితం : 1957 ఫోన్ నెం. 846188

**SANTHANU'S CHITRA VIDYALAYAM (A P)**
**179, Singanna Chetty St, Chintadripet, MADRAS-2.**

ఏమి టా పిచ్చి?'' నవ్వుతూ అన్నాడు.

అతని నవ్వు ఆమెలో అసహనం రేపింది.

''కోరి వచ్చిన ఆడది— రంభైనా మగాడికి ఎప్పుడూ లోకువేనండీ, విజయ్‌గారూ! నాదేలెండి పొరపాటు. ముందుగా అడగడంవలవ చులకనై పోయాను.'' బాధతో అంది ఇందిర.

''ఛ, ఛ. మీరలా అనుకోవద్దు. మీరంటే నాకు ఎప్పటికీ గౌరవమే. మీ రనవసరంగా గిల్టీ గా ఫీలవుతున్నారు'' అన్నాడు విజయ్.

ఆమె ఏం మా ట్లడలేదు.

ఒక్క నిమిషం తర్వాత అంది— ''విజయ్‌గారూ! నిజం చెప్పాలంటే నేను మీకోసం ఎంత కాలమైనా ఆగగల్ను. కాని, మా ఇంట్లోవాళ్ళు నాకు తెలీకుండానే నా పెళ్ళి ఏర్పాట్లు చేసేస్తున్నారు. అందుకే తొందరపడి మిమ్మల్నిలా అడిగేశాను. క్షమించండి.'' గొంతుకు పూడుకుపోగా బలవంతంగా మాట పెగల్చుకుంటూ అంది.

''టేకిట్ ఈజీ. దీంట్లో అంత వర్రీ కావలసిందేమీ లేదు. జీవితంలో ఎన్నో అనుకోని విషయాలు జరుగుతుంటాయి. దాంట్లో ఇదొకటనుకోండి.'' నవ్వుతూ అన్నాడు విజయ్.

కొంచెంసేపు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చుండి పోయారు.

''అయితే నేను వెళతాను.'' లేచి నిలబడుతూ అంది ఇందిర.

''సారీ! మీ మనసుని తీవ్రంగా గాయపరచి నట్టున్నాను. నామీద కోపం పెట్టుకోకండి'' అన్నాడు విజయ్.

ఇందిర ఏమీ మాట్లాడకుండా వెళతానన్నట్టు తలూపుతూ రెండు చేతులూ జోడించి ముందుకు కదిలింది.

ఆమె వెనకే వస్తున్న విజయ్—''ఇందిరగారూ ! స్నేహానికి నేను ఎప్పుడూ విలు విస్తాను. మిమ్మల్ని స్నేహితురాలిగా నే నెప్పుడూ అభిమానిస్తూనే ఉంటాను'' అన్నాడు.

''థాంక్యూ'' అంటూ ఆమె ముందుకు కదిలి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే ఒకక్షణం చూస్తూ ఉండి పోయాడు విజయ్. తర్వాత చిన్నగ నిట్టూరుస్తూ తనలో తాను అనుకున్నాడు—ఆడపిల్లలతో స్నేహాలు పాము పిల్లల్ని ఒళ్ళో ఎక్కించుకుని ఆడించు కోడం లాంటిది. ఆడినంతసేపు ఆడుకుని ఏ క్షణంలోనైనా కాటేసి వెళ్ళిపోతాయి.

● ● ■

పదిరోజులు గడిచాయి.


ఆ తర్వాత విజయ్‌కు ఇందిర మళ్ళీ కనుపించ లేదు. ఆఫీసుకు ఫోన్ కూడ చేయలేదు.

ఇందిరను నొప్పించినందుకు విజయ్ మనసు బాధపడుతున్నా, నిజాన్ని ఆమెకు చెప్పగలిగి నందుకు అతని మనసు తృప్తిగా ఉంది.

అతనూ కావాలనే ఆమెకు ఫోన్ చేయలేదు.

ఒకరోజు ఉదయం పది గంటలకు ఫోనొచ్చింది. ఎప్పుడూ వినని అపరిచిత కంటం.

రాంగ్ నెంబరేమోనని అనుమాన మొచ్చి విజయ్ అడిగాడు—''ఎవరు కావాలి మీకు?''




''విజయ్‌గారు కావాలి.'' సన్నగ పలికింది అవతల్నుంచి ఒక స్వరం.

''ఏ విజయ్?'' మళ్ళీ అడిగాడు.

''ఇంజనీరు విజయ్.''

''అవును. నేనే మాట్లాడుతున్నాను. చెప్పండి— మీ రెవరు? ఏం కావాలి?'' విసుగ్గా అడిగాడు.

''నేను ఇందిర ఫ్రెండ్ రమను. దయచేసి సాయంత్రం మా రూమ్‌కోసారి రాగలరా?'' అంది అవతలి కంటం.

ఇందిర పేరు వినగానే విజయ్‌లో చలనం కలిగింది.

''చెప్పండి. ఇంది రెలా ఉంది? ఎనీ థింగ్ రాంగ్ విత్ హెర్?'' అన్నాడు కొంచెం ఆందోళనగా.

''అబ్బే! కంగారు పడకండి. అటువంటి దేమీ లేదు. అది ఎందుకో పది రోజుల నుంచీ భోజనం చేయడం మానేసింది. ఏమడిగినా చెప్పదు. ఏదో పోగొట్టుకున్న దానిలా ఉంటూంది. మీకు తెలుసను కుంటా దాని మొండితనం? నన్ను చాలా విసిగిం చేస్తూంది. దయచేసి మీ రొక సారి వచ్చి చెబితేనే కానీ, అది వినేట్టు లేదు. వస్తారు కదూ! మీ అడ్రసు తెలుసుకుని ఫోన్ చేశాను. నేను ఫోన్ చేశానని మాత్రం దానికి చెప్పకండి. నన్ను చంపే స్తుంది...ఉంటానండీ!'' అని ఫోన్ పెట్టేసింది.

సాయంత్రం అయ్యింది.

విజయ్ ఆటో చేసుకుని ఇందిర వాళ్ళ రూమ్‌కి బయలుదేరాడు. ఎప్పుడో ఇందిర చెప్పిన ఆనవాళ్ళతో రూమ్ గుర్తించడం సులభంగానే జరిగింది.

వెళ్ళి తలుపు తట్టాడు.

ఒక్క నిమిషం తరవాత తలుపులు తెరుచు కున్నాయి.

ఎదురుగా గుమ్మంలో ఇందిర.

''ఎలా ఉన్నారు?'' నవ్వుతూ పలకరించాడు విజయ్.

''ఆఁ, మీరా? నా రూమ్ మీ కెలా తెలుసు?'' ఆశ్చర్యంగా అంది ఇందిర.

''ఎలాగోలా తెలుసుకున్నాను కానీ, ముందు నన్ను లోపలికి రానిస్తారా?'' అన్నాడు అన్నాడు విజయ్.

''సారీ, రండి.'' గుమ్మం లోంచి అడ్డు తొలు గుతూ అంది ఇందిర.

లోపలి కొచ్చిన విజయ్ గదిని ఒక సారి పరికించాడు.

గది చిన్నదయినా అందంగా అలంకరించబడి ఉంది.

గది మధ్యలో రెండు మంచాలు, మూలగా ఒక టేబిల్, కుర్చీ. గోడకు వేలాడుతున్న రెండు అంద మైన రవివర్మ పెయింటింగ్స్. మూల ఒక రెండు స్టవ్‌లు, నాల్గయిదు స్టీలు పాత్రలు. గుమ్మానికీ, కిటికీలకు వేలాడుతున్న అందమైన కర్టెన్‌లు.

''ఏమిటి ఇలా వచ్చారు?'' నవ్వు మొహం మీదికి తెచ్చుకుంటూ అంది ఇందిర.

అప్పటి వరకూ గదినే పరికిస్తున్న విజయ్ కళ్ళు ఇందిర మీదకు చేరుకున్నాయ్.

జుట్టంతా చెదిరిపోయి, కళ్ళు లోతుకుపోయి చెంపలు పాలిపోయి, నలిగిన చీరెలో ఉన్న ఇందిర— అలనాటి అశోకవనంలోని సీతను గుర్తుకు తెస్తూంది

ఒక క్షణం ఆమెనే పరికించిన అతను, ఆమె ప్రశ్నకు సమాధానం ఇస్తూ అన్నాడు—''ఏం రాకూ డదా?'' అని.

''అబ్బే. అలా అని కాదు. మీ లాంటి పెద్ద వారు...'' మధ్యలో ఆగిపోయింది.

''అదంతా ఎందుగ్గానీ, ఏమిటలా అయి పోయావు?'' నవ్వుతూ అన్నాడు.

''ఏంలేదు. కొంచెం ఒంట్లో నలతగాఉంటేనూ.'' నసిగింది.


''ఎందుకండీ అలవాటులేని అబద్ధాలు? అబద్ధాలు కూడా అందరూ చెప్పలేరు. మీరు చెప్పాలని ప్రయత్నించినా, మీ కళ్ళు నిజాన్ని దాచలేవు. నిజం చెప్పండి...ఎందు కీ సత్యాగ్రహం?'' విజయ్ అడిగాడు.

''మీకెవరు చెప్పారు? ఆ రమలే కదూ! రానివ్వండి దాని పని చెబుతా!'' కోపంగా అంది ఇందిర.

''అనవసరంగా ఆమె నెందుకు తప్పు పడతారు? పాపం, స్నేహితురాలిగా మీ గురించి ఆందోళన పడడంలో తప్పు లేదుగా?'' అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

''చూడండి, ఇందిరగారూ! మీరేమీ అనుకో నంటే మీతో ఒక పచ్చి నిజం ఇవ్వాళ చెప్పక తప్పడం లేదు.''




ఏమిటన్నట్లు అతని వైపు చూసింది.

"నాకు నా పర్సనల్ విషయాలు ఎవ్వరికీ చెప్పడం ఇష్టం ఉండదు కానీ, మీకు చెప్పవలసిన పరిస్థితి వచ్చింది. నేను చాలా కాలం క్రితం ఒక అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయీ నన్ను ప్రేమించింది. అయితే, కొన్ని కారణాలవల్ల మా ప్రేమ దారుణంగా విఫలమై పోయింది. ప్రాణానికి సమానంగా ప్రేమించిన ఆ అమ్మాయిని నేను ఇప్పటికీ మరిచిపోలేక పోతున్నాను. నా జీవితంలో ఇంకో అమ్మాయికీ చోటివ్వలేకపోతున్నాను. అలాగని నేను జీవితం మీద విరక్తి పెంచేసుకుని మీలా బెంగపెట్టుకుపోయానా? జీవితాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి. అప్పుడే ఆ జీవితం మిమ్మల్ని సరైన దారిలో నడిపిస్తుంది. ఇప్పుడు చెప్పండి—ఇంత చెప్పిన తరవాతకూడా మీకు నా మీద అసహ్యం కలగడం లేదూ?" అన్నాడు విజయ్.

"లేదు మీ గతంతో నాకు సంబంధం లేదు" అంది ఇందిర.

అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న విజయ్ మొహంలో చిరాకు తొంగి చూసింది.

"ఏమిటీ ఈ అమ్మాయి మనస్తత్వం? ఎంతసేపు తన గొడవే కాని, ఎదుటి మనిషిని అర్థం చేసుకోదే" అని మనసులో అనుకుని—"సరే మీ అభిప్రాయాలే మీ వైతే, నేను చెప్పేదేమీ లేదు. క్షమించండి నా మనసు మారదు. వస్తా." విసురుగా లేచి వెళ్ళి పోయాడు.

అతను వెళ్ళిన వైపే నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది ఇందిర.

• • • •

వారం రోజులు గడిచాయి.

ఒక రోజు సాయంత్రం ఐదు దాటిన తరవాత విజయ్ ఆఫీసు మెట్లు దిగుతూండగా ఒక అమ్మాయి వచ్చి, "మీరు విజయ్ కదూ!" అంటూ పలకరించింది.

"ఔను" అని తలూపుతూ, "మీరు?" అన్నాడు.

"నేను ఇందిర ఫ్రెండు రమనండీ!" అంది ఆ అమ్మాయి.

"ఓహ్. రమంటే మీరేనా? ఏమిటిలా వచ్చారు? ఇందిరెలా ఉంది?" ఆత్రంగా అడిగాడు.

"అది రెండు రోజుల క్రితం స్లీపింగ్ పిల్స్ మింగేసింది." దిగులుగా చెప్పింది.

"ఇప్పుడెలా ఉంది? ఎక్కడుంది?" కంగారుగా అడిగాడు.

"అబ్బే కంగారు పడకండి. ఇప్పుడు బాగానే ఉంది. టెలిగ్రామ్ ఇచ్చి వాళ్ళ మదర్‌ని రప్పించాను. ఈ రోజు రాత్రి బండికి మద్రాసు వెళ్ళిపోతోంది. మిమ్మల్ని ఒక్కసారి చూడాలనుందట — స్టేషన్‌కు రమ్మంది. వస్తానండీ." వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది.

విజయ్ మనసంతా పాడైపోయింది.

"ఏమిటిది... ఎందుకు ఆ అమ్మాయికి తనంటే అంత పిచ్చి. ఏమిటో ఆడపిల్లలు?" నిట్టూరుస్తూ అనుకున్నాడు.

• • • •

నాంపల్లి రైల్వే స్టేషన్ కోలాహలంగా ఉంది. తమ రిజర్వుడు బోగీ ఎదురుగా ఉన్న బెంచీమీద ఇందిర, ఆమె ప్రక్కన ఒక నడి వయస్సు స్త్రీ కూర్చుని ఉన్నారు. వాళ్ళ కెదురుగా రమ నించుని కబుర్లు చెబుతోంది.

విజయ్‌ను చూసిన ఇందిర లేచి విష్ చేసి వాళ్ళ అమ్మకు పరిచయం చేసింది. ఆమెను అలా పక్కకు వెళ్ళనిచ్చి, తెచ్చిన ఆపిల్స్ బుట్టను ఇందిర చేతికిస్తూ "ఒంట్లో ఎలా ఉంది — ఏదో హడావుడి చేశారట కదా?" అన్నాడు నవ్వుతూ.

"బాగానే ఉంది." క్లుప్తంగా అంది.

"మళ్ళీ ఎప్పుడు రాక?" అడిగాడు.

ఒక రెండు క్షణాలు మౌనం తర్వాత అంది ఎటో చూస్తూ—"బహుశా ఇక రాకపోవచ్చు."

"అదేమిటి? మరి ఉద్యోగం!" ఆశ్చర్యంగా అడిగాడు విజయ్.

"లీవ్‌లో ఉండి ట్రాన్స్‌ఫర్‌కి అప్లయి చేస్తాను." కళ్ళు దించుకుంటూ అంది.

"ఇందిరగారూ! ఇదంతా నా మీద కోపంతోనే కదూ!" బాధగా అడిగాడు.

"నా కెవ్వరిమీదా కోపం లేదు. కొన్ని జ్ఞాపకాల్ని మర్చిపోవాలంటే కొన్ని ప్రదేశాలని విడిచిపెట్టక తప్పదు."

ట్రెయిను కూత వేసింది.

"ఎక్కండి కదిలేట్టుంది:" అన్నాడు విజయ్.

ముగ్గురూ కంపార్ట్‌మెంట్ ఎక్కారు.

"రమగారు కూడ మీతో వస్తున్నారా?" అడిగాడు విజయ్.

"అవును. నాతో వారం రోజులుండి వెనక్కి వచ్చేస్తుంది" అంది ఇందిర. ట్రెయిను బయలుదేరింది.

గుమ్మం దగ్గరే నిలబడి ఉన్న ఇందిర చెయ్యి వూపుతూ, "వెళ్ళొస్తానండీ" అంది.

"గుడ్‌లక్!" చెయ్యి వూపుతూ అన్నాడు.

అనుకోకుండా అతని కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. కర్చీఫ్‌తో కళ్ళొత్తుకుంటున్న అతన్ని క్షణంలో చూసి ఇందిర తన సీట్లోకి వెళ్ళి నీరసంగా కూలబడింది.

• • • •

ట్రెయిను వేగంగా దూసుకపోతోంది.

"నటి ననిపించుకున్నావే. స్టేజిమీదే కాదు నిజ జీవితంలో కూడ ఇంత గొప్పగా నటిస్తావని నే నెప్పుడూ అనుకోలేదు. మ న్యతని గురించి మరీ అలా బాధపడిపోతుంటే నాకే అనుమాన మొచ్చింది. కొంప దీసి నిజంగా ప్రేమలో పడ్డావేమోనని. మొత్తానికి నీ నటనా చాతుర్యంతో ఆ మానవుడ్ని ముప్పతిప్పలు పెట్టేశావ్." నవ్వుతూ అంది రమ, ఇందిర భుజం మీద చరుస్తూ.

ఆమె మాటలకు ఇందిర నవ్వలేదు.

"లేదే, రమా! ఒక ఫ్రెండుతో పందెం కాసి జీవితంలో మొదటిసారిగా ఓడిపోయాను.

భగ్న హృదయంతో ఉన్న మగాడు మళ్ళీ ఇంకో అందమైన ఆడది కనపడి నవ్విస్తే, పాత కథంతా పాతరేసి ప్రేమ, దోమ అంటూ వెంట పడతాడు. అది మగాళ్ళ మనస్తత్వం అని వాదించేదాన్ని. కానీ నా ఫ్రెండు జ్యోతి చెప్పినట్టు అతను నిజంగా గొప్ప ప్రేమికుడు. అటువంటి ప్రేమికుడ్ని పొందలేక పోయిన జ్యోతిని చూసి జాలి పడుతున్నాను." నిట్టూరుస్తూ అంది.

• • • •

విజయ్ స్వగతం: "పాపం పిచ్చి పిల్ల ఇందిర! నాకు నిజంగానే పెళ్ళి కాలేదేమోనని నా వెంట పడింది. అయితే, నాకూ పెళ్ళయిందనీ, పురిటికి పుట్టింటికి వెళ్ళిన నా భార్య అనారోగ్య కారణంగా సంవత్సరం పైనుంచీ అక్కడే ఉంటోందనీ ఆమెతో చెప్పలేక పోయాను.

కారణం...

అకస్మాత్తుగా నా దగ్గరున్న ఫోటో గుర్తొచ్చింది. పెట్టె అడుగున ఉన్న ఫోటో పైకి తీశాను.

ఫోటోలో—"జ్యోతి", ప్రక్కనే "ఇందిర."

ఫోటో వెనక్కి తిప్పిచూశాను.

"జ్యోతి"—"ఇందిర"

ముచ్చటగా స్వహస్తాలతో రాసుకున్న వారి పేర్లు కనపడ్డాయి.

ఇందిరను చూసిన మొదటి రోజునే ఆమెను ఎక్కడో చూసినట్లనిపించి, కావాలనీ ఆమెతో స్నేహం పొడిగించాను.

మద్రాసులో జ్యోతికి ఇందిరనే ఒక ఫ్రెండు ఉండేదనీ, తరచు వాళ్ళిద్దరూ ఉత్తరాలు రాసుకుంటుండేవారనీ, ఒకసారి మద్రాసుకు ఎక్స్‌కర్షన్ వెళ్ళిన జ్యోతి ఆమెతో ఒక ఫోటో తీయించుకుని వచ్చిందనీ జ్యోతికి గుర్తుందో, లేదో తెలీదుగానీ— ఇందిరకు మాత్రం ఆ విషయం తెలిసినట్టు లేదు.

నా జ్ఞాపకశక్తి అద్భుతంగా పని చేసింది. నా అంచనా తప్పలేదు. ఏమైనా నా జ్యోతి మనసులో నే నెప్పటికీ ఒక గొప్ప ప్రేమికుడుగానే మిగిలిపోతాను. *